క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ ఫణీరాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు.

31న వ్యాసరచన పోటీలు

లక్కిరెడ్డిపల్లి : మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు, ఈ పోటీలలో మండలంలోని ప్రతి విద్యార్థి పాల్గొనాలని జామియాతే ఇతేహాదుల్ కమిటీ సభ్యులు గురువారం తెలియజేశారు. ఈనెల 31న ఆదివారం లక్కిరెడ్డిపల్లి ఉర్దూ ఉన్నత హైస్కూల్‌లో మహమ్మద్ ప్రవక్త గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 95507 37304, 81438 80494, 90592 28362 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

కాజ్‌వే వద్ద పోలీసు పహారా



సిద్దవటం : సిద్దవటం పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే వద్ద పోలీసులు గురువారం పహారా కాశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ సిద్దవటం వద్ద పెన్నా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారని దీంతో కాజ్‌వే పైన పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

వీల్ చైర్ అందచేత

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితం అయిన చంద్రబోస్‌కు రాయచోటి లయన్స్ క్లబ్ వారు వీల్ చైర్‌ను అందించారు. రాయచోటి పట్టణానికి చెందిన చంద్రబోస్ మే నెల 16వ తేదీన చిన్నమండెం మండలంలోని కేశాపురం వద్ద కారు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేసినప్పటికీ పూర్తిగా నడవలేని పరిస్థితిలో మంచంలోనే ఉన్నాడు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్యామ్ రాయచోటి శ్రీ కృష్ణ హాస్పిటల్ యజమాని డాక్టర్ ఉషారాణి ఆర్థిక సాయంతో వీల్ చైర్‌ను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ డైరెక్టర్ లయన్ మహమ్మద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు గీజర్ వితరణ



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహానికి తహసీల్దార్ అమరేశ్వరీ యాభై లీటర్ల గీజర్‌ను వితరణగా అందజేశారు. గీజర్‌ను స్వయంగా అన్ని ఖర్చులతో ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు చలికాలంలో చల్లటి నీళ్లతో స్నానం చేయడం ఇబ్బందికరంగా ఉంటుందని భావించి గీజర్‌ను అందజేసినట్లు చెప్పారు.

శాంతియుతంగా వినాయక చవితిని జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ మహేష్ నాయుడు

ఓబులవారిపల్లె : వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేయరాదని తెలియజేశారు. ఏదైనా ప్రమాదాలు, గొడవలు జరిగితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పుల్లంపేట : పుల్లంపేట శివాలయం వీధిలో ఉన్న అంగన్‌వాడీ -1,2 కేంద్రాలను ఎంపీడీఓ జయశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం పోషకాలు అందేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతివారం ఏఎన్ఎంను పిలిపించుకొని చిన్న పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వ్యాక్సినేషన్ సక్రమంగా జరిపించాలని సూచించారు.

పింఛన్ల తొలగింపు దుర్మార్గం



సుండుపల్లె : రీవెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌లు నిలిపివేయడం దారుణమని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రెహమాన్‌ఖాన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వెరిఫికేషన్‌లో భాగంగా సదరం సర్టిఫికెట్లు మరలా సమర్పించాలని అందులోనూ కొందరికి రూ.15 వేల పింఛన్లు వచ్చే వారికి నమోదు శాతాన్ని తగ్గించి రూ.6 వేలు చేసి మరికొందరికి పూర్తిగా రద్దు చేసి వారి కడుపు కొట్టడం చాలా బాధాకరమన్నారు. పింఛన్లు పెంచామని గొప్పగా చెప్పుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు పింఛన్లు తొలగించి లబ్ధిదారుల జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు.

సమతుల్యత పాటిద్దాం.. దిగుబడి పొందుదాం

- వర్షా కాలంలో పాడి రైతులు అప్రమత్తత అవసరం
- పోషక ఆహారాలు అందిస్తేనే ఆదాయమంటున్న పశువైద్యులు



సంబేపల్లె : రైతులకు వ్యవసాయం ప్రధాన వృత్తి అయినప్పటికీ పశుపోషణతో అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయంలో సీజన్ వారీగా ఆదాయం వస్తే.. పశుపోషణతో ప్రతి 15 రోజులకు ఒకసారి ఆదాయం పొందవచ్చు. ఈ క్రమంలో పశుపోషణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పశువులకు అనేక వ్యాధులు ప్రబలే అవకాశంవుంది. పశుసంపద అభివృద్ధి చెందాలంటే వాటికి పోషణతో కూడిన ఆహారం అందించడం ఎంతో అవసరం. తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు, ఖనిజ పదార్థాలు, లవణాలు, విటమిన్లు, నీరు అత్యవసరమన్నారు. వీటిని పశువులకు సక్రమంగా అందేలా పాడి రైతులు కృషిచేయాలని పశువైద్యులు చెబుతున్నారు.

పిండి పదార్థాలు..

పశులవుల శరీరంలో కొవ్వు నిల్వ, అంతర్గతంగా అవయవాల దెబ్బల నుంచి పిండి పదార్థాలు కాపాడుతాయి. అలాగే శరీంలో ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించడంతో పాటు పునరుత్పత్తిలో మాంసపుకృత్తులు కంటే పిండి పదార్థాలు శక్తిని అందిస్తాయి. ఒక గ్రాము కొవ్వు పదార్థం దాదాపు 9 కిలో క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరిపిండి తదితర వాటిలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా వుంటాయి.

నీరు చాలా అవసరం..

మేత లేకుండా పశువులు మూడు నెలలు పాటు బతుకుతాయి. కానీ నీరు లేకుండా ఐదు రోజులకు మించి ఉండలేవు. శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు నీరు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలలోని వివిధ భాగాలకు చేర్చడానికి శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి శ్వాసప్రక్రియ కొనసాగించడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉంచేందుకు చర్మం సాగుగుణం కలిగి వుండటానికి, జీర్ణ క్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైమ్‌ల తయారీకి వ్యర్థ పదార్థాల విసరన క్రియకు దోహదపడుతుంది. పశువులకు నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్రం సంబంధించి వ్యాధులు, అజీర్తి, మలబద్దకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జించడానికి పశువులు డీ హైడ్రేషన్‌కు గురై మరణిస్తాయి. కాబట్టి పశువులకు అత్యంత అవసరమైయే వాటిలో షోషక పదార్థాలు ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50 నుంచి 60 లీటర్లు నీరు అవసరం.

మాంసపుకృత్తులు..

పశువుల శరీరం నిర్మాణానికి, ఎదుగుదలకు, రోగ నిరోధక శక్తి మాంసపుకృత్తులు తోడ్పతాయి. శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండటం, ఆలస్యంగా యుక్తవయస్సు రావడం వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండాలు బలహీనంగా మారే సమస్యలు ఉప్పన్నమవుతాయి. పత్తి గింజ, కొబ్బరిపిండి వేరుశనగ పిండి తదితర ముడి పదార్థాలు పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

వర్షాకాలంలో జాగ్రత్త



వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా రైతులు అప్రమత్తంగా వుండాలి. పశువులకు ఎటువంటి వ్యాధి సోకినా వెంటనే సంబంధిత పశు వైద్యాధికారిని సంప్రదించాలి. అవసరమైన వైద్య సేవలు అందించాలి. పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేస్తున్నాం.

– పి. శ్రీధర్‌రెడ్డి, పశు వైద్యాధికారి, సంబేపల్లె

మామిడి రైతులకు శిక్షణ

సుండుపల్లె : మండలంలోని మామిడి రైతులకు శుక్రవారం మామిడి పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ శాఖ అధికారి వనితాబాయి తెలిపారు. శుక్రవారం ఉదయం ఈడిగపల్లె సచివాలయం, మధ్యాహ్నం పెద్దినేనికాలువ, శనివారం ఉదయం మాచిరెడ్డిగారిపల్లె, మధ్యాహ్నం ముడుంపాడు సచివాలయాలలో శాస్త్రవేత్తలతో రైతులకు మామిడికోత తర్వాత తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న సాయిబాబా ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరబల్లి భక్తి భజన బృందం ద్వారా ఆలయంలో భక్తి పాటలను ఆలపించారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలను నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఈగల్ టీమ్

ఒంటిమిట్ట : డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ క్రియాశీలక పాత్ర పోషించాలని ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) అధికారులు విద్యార్థులకు మాదక ద్రవ్యాల అనర్థాల గురించి అవగాహన కల్పించారు. బుధవారం ఒంటిమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమాజంలో కొందరు వ్యక్తులు వినియోగిస్తున్న డ్రగ్స్ వల్ల వ్యక్తిగత, కుటుంబ, సమాజ స్థాయిలో కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్టాలు, చట్టంలోని కఠిన శిక్షలు గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, స్థానికులకు ఇంటి సమీపం లేదా పాఠశాల చుట్టు పక్కల ఏమైనా డ్రగ్స్ దుర్వినియోగం లేదా గంజాయి విక్రయాలను గుర్తించిన ట్‌లెతై టోల్ ఫ్రీ నెంబరు. 1972కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెడ్ మాస్టర్ నిరంజమ్మ, పాఠశాల ఈగల్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ టీమ్ నుంచి ఆయూబ్ ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బండ పుల్లపుట్టమ్మ జాతర



జాతర సందర్భంగా మొక్కుబడులు చెల్లించుకుంటున్న భక్తులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ముదినేపల్లి గ్రామంలో గురువారం గ్రామ దేవత బండ పల్లపుట్టమ్మ జాతరను కనుల పండువగా నిర్వహించారు. వందల సంవత్సరాల పురాతనమైన గుడి శిథిలమవ్వగా గ్రామస్తులు కొత్త గుడిని నిర్మించారు. వారం రోజుల పాటు గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు జరిపారు. దశాబ్దాల తరువాత గ్రామ దేవత జాతరను నిర్వహించడంతో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. మొక్కుబడులు ఉన్నవారు అమ్మవారికి ఎద్దుల బండ్లు అలంకరించి గుడికి వెళ్లి పూజలు చేయించారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఇతర ప్రాంతాల నుండి బంధు, మిత్రులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.

మానవతా విలువలు కలిగి ఉండాలి



లక్కిరెడ్డిపల్లి: వైఎస్సార్ విగ్రహం వద్ద విద్యార్థుల మానవహారం



గాలివీడు: శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ జగన్నాథ్‌రెడ్డి

గాలివీడు : సమాజంలో ప్రతి ఒక్కరూ మానవతా విలువలు కలిగి ఉండాలని చీమల చెరువుపల్లి మాజీ సర్పంచ్ పొట్లి జగన్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపకులు రామచంద్రా రెడ్డి ఆదేశాల మేరకు చైర్మన్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని మాజీ సర్పంచ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ చేయుతనివ్వాలని, ప్రపంచ శాంతి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. మానవత ఆధ్వర్యంలో గాలివీడు మండలంలోనే గాక పక్క మండలాలైన ఎన్పీ కుంట, పెద్దమండ్యం మండలాల్లోనూ శాంతి రథం, అంబులెన్స్, బాడీ ఫ్రీజర్ బాక్సులతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచడం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలతో అందరి మన్నలను పొందుతోందని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెంగల్ రాజు, డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, కార్యదర్శి శంకర, మానవత రాయచోటి, గాలివీడు శాఖల సభ్యులు పాల్గొన్నారు.

విశ్వమానవ శాంతి కోసమే..

లక్కిరెడ్డిపల్లి : విశ్వ మానవ శాంతి కోసమే మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేపట్టినట్టు ఆ సంస్థ కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. మానవత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శాంతి ర్యాలీని లక్కిరెడ్డిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ క్రాంతి కుమార్, మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్, ఏఎస్ఐ గోపీనాయక్, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, మానతా చైర్మన్ బాల సుబ్రమణ్యంలు పాల్గొని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో మిస్పా చర్చి నుంచి ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత జిల్లా కార్యదర్శి శివయ్య, వీరనాగిరెడ్డి, రవిశంకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, గంగయ్య, మనీషా స్కూల్ చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, నలంద, మనీషా స్కూల్, ప్రభుత్వ బాయ్స్ హైస్కూల్, వెంకటేశ్వర, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



తయారు చేసిన ఆహార పదార్థాలతో విద్యార్థులు

చిట్వేలి : స్థానిక ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా కోర్సు విద్యార్థుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. పుడ్డింగ్ ఆహార పదార్థాన్ని తయారు చేసే విధానాన్ని నేర్పించారు. ఇందుకు సంబంధించి రీ ఫ్రిజిరేటర్ మైక్రో ఓవెన్, ఇండక్షన్ స్టవ్, ఫ్రూట్ మిక్సర్, మిక్సడ్ కేక్ తయారీ తదితర సామగ్రిని పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులైన ప్రథమ చికిత్స విధానం, ఎలక్ట్రానిక్స్ విభాగం, ఐటీ విభాగం, విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్యాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చినబాబు, నాగమణి, సుహాసిని, సుభాష్ చంద్రబోస్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉందాం

అధికారులకు ఎంపీపీ సుధామాధురి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధామాధురి

చిన్నమండెం : వర్షా కాలంలో ప్రబలే వ్యాధులు, విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు ఎంపీపీ సుధామాధురి సూచించారు. చిన్నమండెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసపురంలో ప్రజలకు నీటి సమస్య ఉందని వెంటనే ఇబ్బందులు తీర్చాలని అధికారులకు సూచించారు. మండల వ్యాప్తంగా పలు సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓకు ఎంపీపీ సూచించారు. అనంతరం పీఆర్ జేఈ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డీఎంఎఫ్ కింద గొర్లముదివీడు హరిజనవాడ నుంచి ఉప్పరపల్లికి రూ.1.99 కోట్లతో, ఆర్ అండ్ ఆర్ కాలనీ నుండి పాత వట్టంవాండ్లపల్లికి రూ.1.95 కోట్లు, టి.చాకిబండ నుంచి ఏకిలింకాపల్లికు రూ.1.55 కోట్లు, చిన్నమండెంలో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి ఎన్ఆర్‌జీఎస్ కింద రూ.2.80 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. అనంతరం డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నామని, మందులు కూడా ఉన్నాయని తెలిపారు. అనంతరం ఉపాధి ఏపీఓ మురళీమోహన్ మాట్లాడుతూ రైతులకు పండ్ల తోటలకు, కొబ్బరిచెట్లకు ప్లాంటేషన్ ఇస్తున్నామన్నారు. అనంతరం ఏఓ గీత మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పడనివారు ఈ నెల 25వ తేదీలోపు సంబంధిత సచివాలయాల్లో ఫిర్యాదులు చేయాలని, అలాగే ప్రతి రైతు ఈ-క్రాప్‌లో పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం పశువైద్యాధికారి భాస్కర్ మాట్లాడుతూ పశువుల బీమాను రైతులు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరిస్తామని, అలాగే దివ్యాంగుల పింఛన్లు 515కి గాను 65 మందికి నోటీసులు వచ్చాయని విచారిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ, మండల ఉపాధ్యక్షుడు ఏజాస్ అలీఖాన్, కో-ఆప్షన్ మెంబర్ గౌస్‌సాబ్, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్‌చంద్ర, రత్నమ్మ, తులసమ్మ, రెడ్డప్ప, గంగులయ్య, సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, ముసల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, నజీర్‌అహమ్మద్, రాజమ్మ, అఫ్రోజ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను గురువారం అసిస్టెంట్ అకాడమిక్ అధికారి పివిఎస్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదుల శుభ్రత, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఎంఓ సమీవుల్లా, ప్రిన్సిపల్ ఎం.షావలీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

సుండుపల్లె : మండల పరిధిలోని రైతులందరూ రైతు సేవా కేంద్రాలలో జొన్న, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందులో జొన్నలు ధర 5 కేజీలు రూ.115, మొక్కజొన్నలు ధర 5 కేజీలు రూ.85గా రైతులకు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. గురువారం పెద్దినేనికాలువ రైతు సేవా కేంద్రంలో డాక్టర్ రవికుమార్ నారే రైతులకు జొన్న విత్తనాలను పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బ్రహ్మయ్యకు నివాళి



బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు

రాజంపేట : మాజీ ఎమ్మెల్యే పసుపులేటి బ్రహ్మయ్య వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మయ్య తనయుడు పసుపులేటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అంతకుముందు బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చట్టేటి అనిల్, మాజీ ఎంపీపీ ఎద్దుల వెంకటేశ్వర్లు, కాపు నాయకులు గీతాంజలి రమణ, పసుపులేటి చంద్రశేఖర్, ఉద్దండం సుబ్రమణ్యం, తోటరాము, ఎంఎల్ నారాయణ, మైనార్టీనాయకుడు గౌస్‌బేగ్, సర్దార్ వలీ, నాయకులు మన్నూరు మురళీకృష్ణ, మలిశెట్టి సుబ్బరాయుడు, మేడికొండు రవి, చిట్టే జయచంద్ర, పైడి రవి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

91 మంది దివ్యాంగ పింఛన్లు రద్దు



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు వేచివున్న దివ్యాంగులు

పెనగలూరు : మండలంలో 91 దివ్యాంగుల పింఛన్లు ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలిసింది. రద్దయిన దివ్యాంగులు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ పరుగులు తీస్తున్నారు. పింఛన్‌తోనే బతుకుతున్న దివ్యాంగులు తమ పింఛన్ రద్దు కావడంతో ఒక్కసారిగా గుండెల్లో గుబులు పుట్టింది. దీంతో మండలం నలుమూలల నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని తమ ఆవేదనను అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ తమ పింఛన్లు రద్దు అయితే ఇక మాకు అన్నం పెట్టేవారు ఉండరని గోడును వెలిబుచ్చుకున్నారు. తమ పింఛన్‌లను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని, అధికారులను వేడుకుంటున్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎస్‌యూ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. సెప్టెంబర్ 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో జరిగే ఆర్ఎస్‌యూ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం రాజంపేటలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ప్రశాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని ఆర్ఎస్‌యూ నాయకులు, అభిమానులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆర్ఎస్‌యూ రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాలలోనూ విస్తరించి అక్కడి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తున్నట్లు తెలిపారు.

స్పందించారు.. భారీ వృక్షాన్ని తొలగించారు



నాడు: ప్రమాదకరంగా ఉన్న భారీ వృక్షం



నేడు: భారీ వృక్షాన్ని తొలగిస్తున్న కూలీలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని మార్కెట్ వద్ద ఓ భారీ వృక్షం నేలకొరిగేలా ఉండేది. ఈ నేపథ్యంలో 'దృష్టి సారించండి.. ప్రమాదం తప్పించండి' అన్న శీర్షికతో ఈనెల 15వ తేదీ 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనానికి మున్సిపల్ శాఖ అధికారులు స్పందించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో భారీ వృక్షం నేలకొరిగేలా ఉండటంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు భయాందోళనకు గురయ్యేవారు. ఇలాంటి పరిస్థితుల్లో 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యంగా వ్యాపారులు, వాహనదారులు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



పురవీధులలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం

చిట్వేలి : మండల పరిధిలోని గుడ్లవారిపల్లి సమీపంలో వెలసి ఉన్న శ్రీ మదిరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి, శివపార్వతుల ఆలయాలలో ప్రథమ వార్షిక కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవాలయ ప్రవేశం చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం 11:30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, అన్నదానం, సాయంత్రం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, రాత్రి రామకృష్ణమ్మ బృందం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర ప్రదర్శించినట్టు ఆలయ ధర్మకర్త రామ్మోహన్ రావు, కమిటీ సభ్యులు తెలియజేశారు. గ్రామ పురోహితులు సుబ్రమణ్యం శర్మ, రాజశేఖర్ శర్మలు వార్షిక వేడుకలను జరిపించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

గాలివీడు : మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఆధ్వర్యంలో వైద్యురాలు డాక్టర్ శ్వేతా గురువారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు హెచ్‌బీ, ఐరన్ ట్యాబ్లెట్స్‌తో రక్త హీనత సమస్యను అధిగమించాలన్నారు. పౌష్టికాహారంలో భాగంగా చిక్కీలు, గుడ్లు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. మరీ ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు,రాజంపేట

IPNo.8/2025

తలారి లక్ష్మి W/o సుదర్శన్, వయస్సు 33 సం॥ డోర్ నెం.4/173, యర్రబల్లి గ్రామం,రాజంపేట మండలం,అన్నమయ్య జిల్లా .. పిటీషనరు

V/S

1.చప్పిడి వెంకట సుబ్బరామిరెడ్డి S/o నారాయణ రెడ్డి,వయస్సు 40 సం॥ డోర్ నెం.4-177,యర్రబల్లి గ్రామం,రాజంపేట మండలం,అన్నమయ్య జిల్లా
2.నడ్డిహరి S/o నరసింహులు,వయస్సు 40 సం॥, డోర్ నెం.3/13, యల్లారెడ్డిపల్లి గ్రామం,తప్పెట్ల పోస్టు,వల్లూరు మండలం,వై.యస్.ఆర్.కడప జిల్లా
3.కట్టారి శంకరమ్మ W/o విశ్వనాథరెడ్డి,వయస్సు 50 సం॥,డోర్ నెం.4/305, యర్రబల్లి గ్రామం,రాజంపేట మండలం,అన్నమయ్య జిల్లా.
4.కావురోల సుబ్బరామిరెడ్డి S/o నరసారెడ్డి, వయస్సు 40 సం॥లు,డోర్ నెం.4-173, యర్రబల్లి గ్రామం,రాజంపేట మండలం,అన్నమయ్య జిల్లా.
5.కాయల రమణ S/o అనుమన్న, వయస్సు 55 సం॥ డోర్ నెం.2/143, లక్ష్మీపురంకాలనీ, బోయనపల్లి గ్రామం,రాజంపేట మండలం,అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్లు

నోటీసు

పై పిటిషనరు,పై తెలిపిన రెస్పాండెంట్లు మీద తనను ఇన్ సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో I.P.NO:8/2025 దాఖలు చేసియున్నారు. ఇందులకు గాను ఏవ్వరికైన ఏలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల 02.09.2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు స్వయంగా గానీ,వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెనని ఇందుమూలముగా తెలియజేయడమైనది. // బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు //

ముహమ్మద్ నిజాం జానీ& తెట్టు నూర్‌మహమ్మద్, అడ్వకేట్స్,రాజంపేట